- 14వ స్థానంలో నిలిచిన నిజామాబాద్
- 19వ స్థానానికి పడిపోయిన కామారెడ్డి
- జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**92 శాతానికి పైగా ఉత్తీర్ణత**

# 'పది'లోనూ బాలికలదే హవా



కామారెడ్డి/ఖలీల్‌వాడి, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లోనూ బాలికలు సత్తా చాటారు. ఉత్తీర్ణత శాతంలో బాలురు వెనుకబడ్డారు. ఉమ్మడి జిల్లాలో 92 శాతానికి పైగా విద్యార్థులు పాసయ్యారు. మంగళవారం వెల్లడైన టెన్త్ ఫలితాల్లో నిజామాబాద్ జిల్లా రాష్ట్ర స్థాయిలో 14వ స్థానంలో నిలిచింది. కామారెడ్డి జిల్లా 19వ స్థానానికి పడిపోయింది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 21,858 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 20,486 మంది (93.72 శాతం) పాసయ్యారు. కామారెడ్డిలో మొత్తం 11,926 మంది పరీక్షలు రాయగా, 11,057 మంది (92.90 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక, రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులకు 15 రోజుల పాటు అవకాశం కల్పించారు.

**నిజామాబాద్‌లో..**

ఇందూరు జిల్లాలో బాలుర కన్నా బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 10,714 మంది బాలికలు పరీక్షలు రాయగా, 10,156 మంది (94.79 శాతం) పాసయ్యారు. ఇక, 11,144 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా, 10,330 మంది (92.70 శాతం) ఉత్తీర్ణులయ్యారని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ఫలితాలు వచ్చిన రోజు నుంచి 15 రోజుల్లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**దిగజారిన కామారెడ్డి స్థానం**

పదో తరగతి ఫలితాల్లో కామారెడ్డి స్థానం దిగజారింది. 92.90 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 19వ స్థానానికి పడిపోయింది. మొత్తం 11,926 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 11,057 మంది (92.90 శాతం) పాస్ అయ్యారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం తగ్గింది. కామారెడ్డి జిల్లాలోనూ బాలికలదే పైచేయిగా నిలిచింది. మొత్తం 6,047 మంది బాలికలు పరీక్షలు రాయగా, 5,706 మంది (94.36 శాతం) పాసయ్యారు. ఇక, 6,238 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా, 5,351 మంది (91.02 శాతం) ఉత్తీర్ణులయ్యారని డీఈవో రాజు తెలిపారు. బీసీ సంక్షేమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు 99.04 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు 98.09 శాతం పాసయ్యారని వివరించారు. జిల్లాలో మొత్తం 869 మంది ఫెయిల్ అయ్యారన్నారు.

### జూన్ 3 నుంచి 'అడ్వాన్స్‌డ్' పరీక్షలు..

పదోతరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 22వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని అధికారులు సూచించారు.

# కాంగ్రెస్ వంచనను ఎండగట్టాలి

- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- కేసీఆర్ సభకు తరలిరావాలని పిలుపు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 30: ఆరు గ్యారెంటీల పేరిట వంచించిన కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయని వైనాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. బాన్సువాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా బీఆర్ఎస్‌కు ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, పార్టీతో కలిసి నడిచేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని జనాలకు సరైన పద్ధతిలో అవగాహన కల్పించాలని సూచించారు. కేసీఆర్ పాలనలో ఇంటింటికీ అందిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఓట్లు అడగాలన్నారు. స్వార్థం కోసం పార్టీ మారిన వారిని పట్టించుకోవద్దని, నిస్వార్థమైన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ సొంతమని చెప్పారు. ఈ నెల 4వ తేదీన బాన్సువాడలో నిర్వహించనున్న రోడ్ షోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, 7న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభకు భారీగా తరలి రావాలని కోరారు. ఎంతో మంది నాయకులకు పదవులు ఇచ్చి అన్ని రకాలుగా అండగా ఉన్నామని, కానీ విశ్వాసం లేని కొందరు అధికారం పోగానే బీఆర్ఎస్‌ను వీడుతున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి విమర్శించారు. అధికారం కోసం పార్టీలు మారే వారిని ప్రజలే శిక్షిస్తారన్నారు. పోచారం కుటుంబం మీద ప్రజలు, కార్యకర్తల్లో పూర్తి విశ్వాసం ఉందని, అందుకే గత ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చిందని, అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు మెజార్టీ వచ్చే లా పని చేయాలని కోరారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నేతలు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహులు, ఎజాస్, వెంకట్‌రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, వాహెబ్, శ్రీనివాస్, మోహన్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

# మాయ మాటలను నమ్మొద్దు

**ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**

మాక్లూర్, ఏప్రిల్ 30: అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఆ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి, ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ..పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. పేదలు, రైతులకు సంక్షేమ పథకాలు పక్కాగా అందాయని గుర్తుచేశారు. రైతులకు వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ..ఇప్పుడు నోరెత్తడం లేదని విమర్శించారు. ప్రజలను అబద్ధాలతో ఆగంచేసే కాంగ్రెస్, బీజేపీ కావాలా.. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, మాజీ సర్పంచులు మల్లారెడ్డి, లింగన్న, రఘురావు, నాయకులు గణపతినాయక్, గోపు రంజిత్, గంగాధర్, పుణ్యరాజ్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

# 'బాండ్' బాబులను ఓడించాలి

**నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**



జగిత్యాలలో మాట్లాడుతున్న బాజిరెడ్డి, పక్కన ఎల్.రమణ, ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 30: 'కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు తోడుదొంగలు. నకిలీ సెక్యులర్ జీవన్‌రెడ్డి, నకిలీ మతవాది అర్వింద్. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలువద్దని కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయి. ఇప్పుడూ కలిసే పనిచేస్తున్నాయి' అని బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవులు అన్ని జీవన్‌రెడ్డికేనా..? కాంగ్రెస్‌లో వేరే నాయకులు లేరా..? అని ప్రశ్నించారు. ప్రతి పదవీ తనకే కావాలంటున్న జీవన్‌రెడ్డి.. మరీ ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడిదాకా వచ్చిందో చెప్పాలన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బాజిరెడ్డి మాట్లాడారు. అర్వింద్ గత ఎన్నికల్లో పసుపుబోర్డు తేస్తానని బాండు పేపర్ రాసిచ్చిండు. అట్లనే జీవన్‌రెడ్డి కూడా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని జగిత్యాల జిల్లా కేంద్రంలోని సీతారామాలయం వద్ద బాండు పేపర్‌పై రాసి హనుమంతుడి మీద ప్రమాణం చేసిండు. పసుపుబోర్డు వచ్చిందీ లేదు. ఆరు గ్యారంటీలు అమలైంది లేదు. ఎన్నికల కోసం బాండ్ పేపర్ రాసిచ్చే బాబులను ఓడించాలని బాజిరెడ్డి పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని నూకపెల్లిలోని 4వేల డబుల్‌బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించి, ఉగాది వరకు గృహప్రవేశాలు చేయిస్తామని లబ్ధిదారులకు జీవన్‌రెడ్డి హామీ ఇచ్చాడని, మరి వాటి పరిస్థితి ఏమిటో తెలువదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి గెలిచిందన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, రైతు రుణమాఫీ ఏమైందని జీవన్‌రెడ్డిని నిజామాబాద్ ప్రజలు నిలదీస్తున్నారన్నారు. తాను మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తిని అని, ఈ ఎన్నికల్లో ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని చెప్పారు. నెలకు ఒకసారి జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో పర్యటిస్తానని, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి, ప్రశ్నించే గొంతుకను అవుతానని స్పష్టం చేశారు. పసుపు బోర్డు నోటిఫికేషన్ మాత్రం వచ్చిందని, ఏర్పాటు మాత్రం చేయలేదన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుపై సుప్రీం కోర్టులో కేసు వేసి సాధిస్తానన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి రాజేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభం

- హామీ ఇచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- రైతుల దెబ్బకు దిగొచ్చిన కాంగ్రెస్ సర్కారు

రెంజల్, ఏప్రిల్ 30: రైతుల ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ సర్కారు దెబ్బకు దిగొచ్చింది. రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ప్రకటించింది. రెంజల్ మండల కేంద్రం నుంచి బ్రాహ్మణపల్లి (బందర్ల) , దూపల్లి ఎక్స్ రోడ్ వరకు రహదారి నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించింది. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పనులు నిలిచిపోయాయి. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం రెంజల్ మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమే నిలిపి వేసిందని, త్వరగా పూర్తి చేయకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రెంజల్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి స్పందించారు. నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికుల రుణం తీర్చుకుంటామని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి తెలిపారు.

# బీఆర్ఎస్‌లో చేరికలు

**ఎల్లారెడ్డి** మండలంలోని మత్తమాల గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే జాజాల వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– ఎల్లారెడ్డి, ఏప్రిల్ 30



# చెత్తలోకే వాహనాలు..

- కోట్ల రూపాయలు వృథా
- ఖరీదైన వాహనాలు కనుమరుగు
- శిథిలావస్థకు చేరిన పరికరాలు







**నిజామాబాద్** నగర పాలక సంస్థలో చెత్త సేకరించే వాహనాలకు సుస్తీ చేసింది. నగర సుందరీకరణలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు విలువ చేసే అత్యాధునిక వాహనాలను కొనుగోలు చేశారు. అందులో రోడ్ క్లీనర్, ఫాగింగ్ మిషన్లు, ట్రాక్టర్లు, చెత్త సేకరించే ఎలక్ట్రిక్ ఆటోలు ఉన్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అప్పటి ప్రభుత్వం కేటాయించిన వాహనాలపై అధికారులు నిర్లక్ష్యం చూపడంతోపాటు వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో మూలనపడుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులు సైతం చేయించకుండా చెత్తలోనే పారవేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వాహనాలు పిచ్చిమొక్కల మధ్య పారవేయడంతో ప్రజాధనం వృథా అవుతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాహనాలు మూలనపడడంతో పలుచోట్ల పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం చూపుతున్నది. మరోవైపు కోటగిరి మండలం పోతంగల్ గ్రామ పంచాయతీలో సైతం చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన రిక్షాలు సైతం చెత్త కుప్పలో దర్శనమిస్తున్నాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్/ కోటగిరి, ఏప్రిల్ 30





